PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

**విలేకరులు కావలెను.**

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 74 | 26 శుక్రవారం, జూన్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## ల్యాండ్ పూలింగ్ ప్లాట్లలో అభివృద్ధి పనులు

రూ.426.46 కోట్ల వ్యయంతోమౌలిక సదుపాయాలు

**అమరావతి,జూన్25ప్రజా సీమ :**

ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. ఉండవల్లి జోన్–11 పరిధిలో ట్రంక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం రూ. 426.46 కోట్ల వ్యయంతో భారీ మౌలిక సదుపాయాల పనులను చేపట్టనుంది. అమరావతి ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధికి అవసరమైన ఈ పనులను ప్యాకేజీ–38 కింద చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు కింద రోడ్డు, డ్రైన్లు, సరఫరా, సెవరేజ్ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ సరఫరా, ఐసీటీ యుటిలిటీ డక్ట్లు, రీయూజ్ వాటర్ లైన్ నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్‌టీపీ ఏర్పాటు, అవెన్యూ ఎలాంటేషన్ పనులను ఈ ప్యాకేజీలో భాగంగా అమలు చేయనున్నారు ఎల్–1 బిడ్డర్‌గా ఎంపికైన ఎన్‌సీసీ లిమిటెడ్‌కు పనులను కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మిగతా 2లో...

# ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

వాటిని పరిరక్షిస్తేనే భవిష్యత్

గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలి

నెలల్లో 33 గేట్ల పునరుద్ధరించాం: సీఎం చంద్రబాబు





**బళ్లారి,జూన్25ప్రజా సీమ :**

దేశంలో నదుల అనుసంధానం తన కలల ప్రాజెక్టు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని పేర్కొన్నారు.రాయలసీమలోని పలు ప్రాంతాలకు సాగునీరు.. మరికొన్ని ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు తుంగభద్ర అని వ్యాఖ్యానించారు. మిగతా 2లో...



## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల ఏర్పాటు

మూడు రాష్ట్రాల సిఎంలు కలసి ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్

ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్

## ఎపిలో క్రియేటివ్ ఎకానమీ విప్లవం

02

జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్

యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ

సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి



## జూలైలో అమరావతి ఆస్పత్రి పనులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వెల్లడి

**అమరావతి,జూన్25ప్రజా సీమ :**

హైదరాబాద్‌లో బసవతారకం ఆస్పత్రి ఇంకా విస్తరణ జరుగుతుందని ఆ హాస్పిటల్ చైర్మన్, హిందూ పురం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. అమరావతిలో కూడా బసవతారకం ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మిగతా 2లో...

# రూ.2 కోట్ల విలువైన 108 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- అనంతపురం జిల్లా బొందలవాడ గ్రామ శివార్లలో ప్రత్యేక దాడి.
- ముగ్గురు అంతర్‌జిల్లా స్మగ్లర్ల అరెస్ట్.
- ఎర్రచందనం తరలింపునకు వినియోగించిన కారు స్వాధీనం.
- ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరించిన స్మగ్లింగ్ నెట్‌వర్క్ వెలుగులోకి.
- ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్ సిబ్బందికి రివార్డులు ప్రకటించిన టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.,




02

# పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుడు



- భక్తులను కటాక్షించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు
- అప్పలాయగుంట బ్రహ్మోత్సవాల్లో తొలి వాహనసేవ వైభవం
- గోవింద నామస్మరణల మధ్య ఆధ్యాత్మిక శోభ

02



## వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

- సాయం అందిస్తామని ప్రకటన
- సాయం కోసం సిద్ధంగా ఉన్నామన్న ట్రంప్

**న్యూఢిల్లీ,జూన్25( ప్రజా సీమ):**

వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 వరకు గాయపడ్డారని తాత్కా లిక అధ్య క్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు.


...మిగతా 2 లో...

# వరుస భూకంపాలను డబ్లెట్ అంటారు

- ఒకేరోజు పలు దేశాల్లో ప్రకంపనలు
- కాలిఫోర్నియా, జపాన్, పుల్వామాలోనూ ప్రకంపనలు

**న్యూఢిల్లీ,జూన్25( ప్రజా సీమ):**

వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకం పాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూ ఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చ డంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



...మిగతా 2 లో...

ప్రజాసీమ

## వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

మొదటిపేజీ తరువాయి

రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.

## ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

తుంగభద్ర డ్యామ్ 70 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాజెక్టు అని తెలిపారు. తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. అందరూ రైతులకూ నమస్కారాలు అంటూ సీఎం చంద్రబాబు కన్నడలో ప్రసంగించారు. ప్రాజెక్టు నిర్వహణ బాగుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతోందని చెప్పారు. 6 నెలల్లో తుంగభద్ర ప్రాజెక్టు 33 గేట్ల పునరుద్ధరించామని వివరించారు. తమిళనాడుకు నీళ్లు ఇవ్వాలని 1983లో నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. నీటి సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇవాళ ముగ్గురు సీఎంలు కలవడం చరిత్రాత్మకమని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు సమస్య ఉందని తెలిపారు. నీరు ఉంటేనే చరిత్ర, నాగరికత అని.. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని చంద్రబాబు అభివర్ణించారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. ప్రాజెక్టులు బాగుంటేనే భవిష్యత్తు తరాలకు భరోసా ఉంటుందని చెప్పారు. తుంగభద్ర.. మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరినీ అభినందిస్తున్నా. కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర తాగు, సాగు నీరు ఇచ్చింది. ఈ నది లేకపోతే చాలా సమస్యలు వచ్చేవి. జలవనరుల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ మనందరి బాధ్యత. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలో నదుల అనుసంధానం చేయాల్సిన బాధ్యత ఉంది. గంగ, కావేరి నదులను అనుసంధానం చేస్తే భారత్ అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్తుంది. సీఆర్ పాటిల్‌కు నదులు అనుసంధానం చేసిన అనుభవం ఉంది. జాతీయ ప్రాజెక్టుగా గోదావరి-కావేరిని కేంద్రం అనుసంధానం చేయాలని చంద్రబాబు అన్నారు. ఇకపోతే కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో చరిత్రాత్మక తీర్మానం చేశామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతుల కోసం తీసుకున్న నిర్ణయం ఓ చరిత్ర అని తెలిపారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, తాను చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. అందరం కలిసి సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. మూడు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తామని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

**బళ్లారి,జూన్25ప్రజా సీమ :**

కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పిల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలిసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.

మొదటిపేజీ తరువాయి

## ల్యాండ్ పూలింగ్ ప్లాట్లలో అభివృద్ధి పనులు

అంచనా వ్యయం రూ.409.78 కోట్లు ఉండగా, 4.07 శాతం అధిక బిడ్‌కు అనుమతి ఇచ్చింది. ఈ కాంట్రాక్ట్‌కు రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌ను నిర్దేశిరచింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి జూన్ 19న జరిగిన ఏపీసీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీర్మానం నెం.669/2026 ఆమోదం పొందింది. అనంతరం ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం.777ను జారీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది. పనుల అవార్డు జారీ చేసేందుకు ఏడీసీఎల్ సీఎండీకి అధికారాలను అప్పగించింది. ఉండవల్లి ప్రాంతంలో సమగ్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా రాజధాని నిర్మాణానికి మరింత వేగం చేకూరనుంది. ఈ ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులను ఏపీసీఆర్‌డీఏ సమకూర్చనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజధాని అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

మొదటిపేజీ తరువాయి

# రూ.2 కోట్ల విలువైన 108 ఎర్రచందనం దుంగలు స్వాధీనం.

మొదటిపేజీ తరువాయి

**ప్రజా సీమ : తిరుపతి.**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శేషాచలం రిజర్వ్ అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం హెడ్ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., మార్గదర్శకత్వంలో, ఆర్ఎస్ఏఎస్టీఎఫ్ ఎస్పీ పి. శ్రీనివాస్, ఐపీఎస్., అదనపు ఎస్పీ జె. కులశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆపరేషన్లు నిరంతరం నిర్వహించబడుతున్నాయి. ఎర్రచందనం కేసుల్లో నిందితులుగా ఉండి పరారీలో తిరుగుతున్న అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లను గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృత చర్యలు చేపడుతున్నారు. టాస్క్ ఫోర్స్ సిబ్బంది మరియు అటవీ శాఖ అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారంతో అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో అనంతపురం జిల్లాకు చెందిన నల్లాని నందకుమార్ 32, నల్లాని జయరామయ్య, బొట్టు రాఘవేంద్రలను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా, పై నిందితులు ఒక ముఠాగా ఏర్పడి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను అక్రమంగా నరికించి, వాటిని దుంగలుగా తయారు చేయించి, అధిక ధరలకు ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రధాన స్మగ్లర్లకు విక్రయించేందుకు ప్రణాళిక రచించినట్లు వెల్లడైంది. ఈ క్రమంలో నార్పల మండలం పరిధిలోని బొందలవాడ నుండి బొమ్మలాటపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రహదారి సమీపంలో జయరామయ్యకు చెందిన పొలంలోని రేకుల షెడ్ పక్కన ఎర్రచందనం దుంగలను డంప్ చేసి దాచిపెట్టినట్లు గుర్తించారు. టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన దాడిలో మొత్తం 109 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమ రవాణాకు వినియోగించిన ఒక కారును కూడా సీజ్ చేసింది. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు మరియు వాహనం కలిపి సుమారు రూ.2 కోట్ల విలువ ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ కేసులో భాగమైన ఇతర ప్రధాన సూత్రధారులు, అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లను గుర్తించి అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది. ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న ప్రధాన కొనుగోలుదారులు మరియు స్మగ్లింగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన వ్యక్తులపై కూడా విచారణ చేపట్టబడుతోంది. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి భారీ మొత్తంలో ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులను అరెస్ట్ చేసిన టాస్క్



ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం అక్రమ నరికివేత, నిల్వ, రవాణా మరియు స్మగ్లింగ్ కార్యకలాపాలపై భవిష్యత్తులో కూడా మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు నిర్దాక్షిణ్యంగా అమలు చేయబడతాయని అధికారులు స్పష్టం చేశారు.

# పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుడు

మొదటిపేజీ తరువాయి



**ప్రజా సీమ : అప్లయగుంట.**


అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలి వాహనసేవ అయిన పెద్దశేష వాహనసేవ గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారు వైకుంఠనాథుడి అలంకారంలో పెద్దశేష వాహనంపై భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించి అనుగ్రహించారు.

### దాస్యభక్తికి ప్రతీకగా ఆదిశేషుడు

శ్రీమహావిష్ణువుకు పరమ భక్తుడైన ఆదిశేషుడు తన పడగలతో స్వామివారికి ఛత్రంలా నీడనిస్తూ, పాన్పుగా సేవ చేస్తూ దాస్యభక్తికి ప్రతీకగా నిలుస్తాడు. త్రేతాయుగంలో లక్ష్మణుడిగా, ద్వాపరయుగంలో బలరాముడిగా శ్రీహరికి సేవలందించిన ఆదిశేషుడు, కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిని మోస్తూ భక్తులకు దర్శనమివ్వడం విశేషం.

### ఆకట్టుకున్న భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు

వాహనసేవకు ముందు హిందూ ధర్మప్రచార పరిషత్, ఎస్వీ సంగీత కళాశాల, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.





ఈ వాహనసేవలో టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, కంకణ భట్టర్ శ్రీ సూర్యకుమార్ చార్యులు, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ వేణుగోపాల్, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## జూలైలో అమరావతి ఆస్పత్రి పనులు

మొదటిపేజీ తరువాయి

బాలయ్య నటిస్తున్న112వ సినిమా అమరావతిలో గురువారం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ఈ మూవీ ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ ముఖ్య అతిథులుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. జులైలో ఆస్పత్రి పనులు ప్రారంభమవుతాయని వివరించారు. 2028లో మొదటి దశ పనులు పూర్తి అవుతాయని చెప్పుకొచ్చారు. బసవతారకం ఆస్పత్రి నిర్మాణం కోసం వర్కర్లు పగలు, రాత్రుళ్లు కూడా కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. వర్షాకాలం కావడంతో పనులు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతోనే ఈ ఆస్పత్రి నిర్మిస్తున్నామని బాలకృష్ణ పేర్కొన్నారు.

## ఎపిలో క్రియేటివ్ ఎకానమీ విప్లవం

**అమరావతి,జూన్25ప్రజా సీమ :**

నవ్యాంధ్రలో సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ విప్లవం'కు శ్రీకారం చుట్టనున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్రంలోని స్థానిక యువత ప్రతిభను ప్రోత్సాహించడంతో పాటు.. యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. గురువారం సచివాలయంలో మంత్రిని జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 క్రాఫ్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏఐ ఆధారిత ఫిల్మ్ మేకింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 24 క్రాఫ్ట్స్ శిక్షణకు సంబంధించి జాడెక్స్ సంస్థ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. సినీ, మీడియా రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం - సాయం అందిస్తామని ప్రకటన
### సాయం కోసం సిద్ధంగా ఉన్నామన్న ట్రంప్

**న్యూఢిల్లీ,జూన్25ప్రజా సీమ :**

వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు.రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు.

ప్రజాసీమ

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

## – బిఎల్ఓలు తప్పనిసరిగా ఇంటింటి సర్వే నిర్వహించాలి– వైకాపా తరపున జేసికి ఎస్.నిసార్ అహ్మద్ వినతి



**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిసార్ అహమద్, వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్.నిసార్ అహమద్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యక్షంగా ఎన్యూమరేషన్ నిర్వహించాల్సి ఉండగా,కొందరు బీఎల్ఓలు ప్రజలను సచివాలయాలకు రమ్మని ఒత్తిడి తెస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.ఇటువంటి పరిస్థితులను నివారించేందుకు బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించిన సమయంలో తప్పనిసరిగా జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు.తద్వారా సర్వే నిజంగా ఇంటి వద్దే జరిగిందని నిర్ధారించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అలాగే ప్రస్తుతం రైతులు ,వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్న నేపథ్యంలో,ప్రజలకు అనుకూలమైన సమయాల్లోనే ఇంటింటి సర్వే చేపట్టాలని,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని కోరారు.వి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల జాబితాల పరిశీలనలో కీలకమైన డీఎస్ఈ (డెమోగ్రాఫికల్లి సిమిలర్ ఎంట్రీస్) జాబితాను అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని కోరారు.తద్వారా రాజకీయ పార్టీలు కూడా జాబితాలను పరిశీలించి,నిజమైన ఓటర్ల హక్కులు పరిరక్షించేందుకు సహకరించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు వినతిపత్రం సమర్పించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు గ్రానైట్ మహేశ్ కూడా ఉన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి జగనన్నని కలిసిన ముబారక్ అహ్మద్

## – వైకాపా అధినేత ఆశీస్సులు తీసుకున్న యువనేత

**మదనపల్లె (ప్రజా సీమ) :**

కడప జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏపీ మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిని పీలేరు నియోజకవర్గం,కలకడకు చెందిన వైసిపి యువనేత ముబారక్ అహమ్మద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా ముబారక్ అహ్మదును మాజీ ముఖ్యమంత్రి ఎంతో ఆప్యాయంగా పలకరించి,యోగక్షేమాలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ముబారక్ అహ్మద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన రాజకీయ నాయకులలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒకరని కొనియాడారు. తన తండ్రి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి నుండి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ఆయన 2019 నుండి 2024 వరకు ముఖ్య మంత్రిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు.నవరత్నాలు అనే సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని ప్రశంసించారు. మాజీ ముఖ్యమంత్రి ఎక్కడికి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని,ఇది ఆయనకు మాత్రమే సొంతమన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంతో జగనన్నది ప్రత్యేక అనుబంధం అని,ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రాజకీయంగా ఆయనకు చేదోడు వాదోడుగా నిలుస్తు న్నారని గుర్తుచేశారు.మాజీ ముఖ్యమంత్రిని కలుసుకోవడం ఆనందంగా ఉందని,2029లో జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి ని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# హిందూ ముస్లింల ఆధ్యాత్మిక మూలాలకు నిదర్శనం మొహరం పండుగ

**ప్రొద్దుటూరు (ప్రజా సీమ) :**

మొహరం పండుగ విశిష్టత గురించి కడప జిల్లా తెలుగు దేశం పార్టీ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్పీ మహబూబ్ హుస్సేన్ వివరించారు. మొహర్రం ఇస్లామిక్ హిజ్రీ క్యాలెండర్‌లో మొదటి నెల. ఇస్లాంలో పవిత్రమైనవిగా భావించే నాలుగు నెలల్లో ఒకటి. హిజ్రీ 61వ సం. మొహర్రం 10వరోజు ప్రవక్త మనవడు కర్బలా యుద్ధం లో వీరమరణం పొందారు. ఈ సంఘటన ఇస్లామీయ చరిత్రలో అత్యంత విషాదకరమైన సంఘ టనలలో ఒకటి. మొహర్రం నెలకు గౌరవం ఇవ్వడం, పాపాలకు దూరంగా ఉండడం, మంచి పనులు ఎక్కువగా చేయడం ఇస్లాంలో ప్రోత్సహించబడింది. మొహర్రం 10 వ దినాన్ని "అశురా"అంటారు. ఈ దినానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. మహమ్మద్ ప్రవక్త మదీనాకు వలస వచ్చినప్పుడు, యూదులు అశూరా రోజున ఉపవాసం ఉండడాన్ని గమనించారు. వారు ఇది అల్లాహ్ మూసా (అలైహిస్సలాం) మరియు ఆయన ప్రజలను ఫిరోన్ నుంచి రక్షించిన రోజు అని చెబుతారు. ప్రవక్త ఆ రోజు తాను ఉపవాసం ఉండి, ఇతరులను కూడా ఉపవాసం ఉండమని ప్రోత్స హించారు. హదీస్ ప్రకారం "అశురా ఉపవాసం" చిన్న పాపాలకు పరిహారంగా ఉంటుంది. ముస్లిం లు హుసైన్ (ర.అ) ను ప్రేమి స్తారు, ఆయన త్యాగాన్ని గౌరవిస్తారు,ఆయనపై జరిగిన అన్యాయాన్ని ఖండిస్తారు. ఈ విషయాల్లో షియా, సున్ని సముదాయాల దృక్పథాలు వేరుగా ఉన్నాయి. సున్నీ సముదాయం కర్బలా సంఘటనను విషాదకర చారిత్రక సంఘటనగా భావిస్తారు."అశురా" రోజు ఉపవాసాన్ని ఆచరిస్తారు. శరీరాన్ని గాయపరచు కోవడం, ఛాతీ కొట్టుకోవడం వంటి చర్యలను చేయరు. షియాలు మాత్రం "కర్బలా"ను తమ మతపరమైన గుర్తింపులో కేంద్ర స్థానంగా చూస్తారు. ప్రత్యేక శోక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఛాతీ కొట్టుకోవడం, శరీరాలు గాయపరచుకోవడం చేస్తారు. ఖురాన్ మొహర్రంను పవిత్ర నెలగా గుర్తిస్తుంది. ఖురాన్ కర్బలా గురించి ప్రస్తావించదు,ఎందుకంటే అది ఖురాన్ అవతరించిన తరువాత జరిగిన చారిత్రక సంఘటన. సహీహ్ హదీస్ "అశూరా" ఉపవాసాన్ని ప్రోత్స హిస్తుంది. శరీరాన్ని హింసించు కోవడం లేదా శరీరాలను గాయ పరచుకుని శోకాన్ని ప్రకటించాడాన్ని ప్రోత్స హించదు. ప్రవక్త ఇలా చెప్పారు: చెంపలు కొట్టుకునేవాడు, బట్టలు చింపు కునేవాడు, జాహిలీయ్యా పద్ధతిలో విలపించేవాడు మనలోనివాడు కాదు.మొహర్రం యొక్క మూల ప్రాముఖ్యత ఖుర్‌ఆన్ మరియు హదీస్ లలో కనబడుతుంది.కానీ నేడు కొన్ని ప్రాంతాల్లో కనిపించే అనేక ఆచారాలు ఆ యా ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక లేదా వర్గపరమైన సంప్రదాయాల నుంచి వచ్చినవి మాత్రమే. మొహర్రం భారతదేశపు సాంస్కృతిక వైభవంలో భాగమయ్యింది. మొహర్రం పీర్ల పండుగగా నేటికీ అనేక గ్రామీణ పట్టణ నగరాల్లో హిందూసోదరుల సహకారంతో ఘనంగా నిర్వహించడం చూడవచ్చు. అయితే కొంత మంది విదేశీ సంస్కృతి ఒంటబట్టించుకున్న ముస్లింలు మాత్రం కొన్ని సాంస్కృతిక అంశాలను ఖురాన్ లో లేవని అభిశంసిస్తూ వుంటారు. మనిషి తో మనిషి కులమని మతమని దూరమౌతున్న నేపథ్యంలో పది మంది కలుసుకుని నిర్వ హించుకునే ఏ సందర్భం అయినా గొప్పదే. ఏ పండగైనా ఆహ్వానించతగిందే. అది జెండా చెట్టుకు నిర్వహించే ఉరుసు, దస్తగిరి స్వామి గ్యార్మీ, పూరీల పండుగ ఏదైనా కానివ్వండి ఇలా బంధుమిత్రులను ఒకచోట చేర్చే ప్రతి సందర్భం గొప్పదే. అలా కాకా మతపరం కాదని ఖురాన్లో లేదని అడ్డు చెప్పడం సాంస్కృతిక నేరం అవుతుంది. ఏ మతమైన పరాయి దేశంలో అభివృద్ధి చెందింది అంటే ఆ దేశపు సంస్కృతి గొప్పదనమే అయివుంటుందనేది తిరుగు లేని సత్యం. ముస్లిం సమాజంలో చాలా మంది ఈ రోజు వరకు ఖురాన్, నమాజ్ కాన్సెప్ట్ తెలియని అమాయకులు



ఉన్నారు, వారు ఈ దేశ జనాభాలో సంస్కృతిలో మమేకమై జీవనం సాగిస్తున్నారు. చాలామందిపై జమాయత్ ల ప్రభావం లేదు.జమాయత్ ల ప్రభావం ఎగువ మధ్యతరగతి చదువుకున్న వారిపై మాత్రమే అనేది నిష్టుర సత్యం. కచ్చితంగా గమనించాల్సిన మరో నిజం ఏమిటంటే జెండాచెట్టు, పీర్లు, ఫాతేహ లాంటివి ఇస్లాం లో నిషిద్ధం అని వాదించే వారు ఏమాత్రం ఖురాన్ పరిధిలో ఉండరు, నిష్ఠగా ఇస్లాం పాటించరు. ఇస్లాంలో నిశిద్ధమైన వడ్డీ వ్యాపారస్తులు జమాయత్ లలో ఉండటం గమనార్హం. హజ్ యాత్రల పేర స్మగ్లిశీగ్ నిర్వహించేవారు.ఎదుటి వారికి శ్రీరంగ నీతులు చెప్పే సాంస్కృతిక దాడిని మేధావి వర్గం ప్రోత్సాహించకూడదు. పీర్ల పండుగ "హిందూ–ముస్లిం" ల ఆధ్యాత్మిక మూలాలకు సంకేతం.

# ఎస్.ఐ.ఆర్ ఓటర్ల వెరిఫికేషన్ కొరకు ప్రత్యేక బృందం ఏర్పాటు

## – కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**




ఎన్నికల సంఘం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ మరియు వెరిఫికేషన్ ప్రక్రియపై గురువారం కురవంక గ్రామంలో విస్తృత అవగాహన కార్యక్రమం ప్రారంభమైంది.గ్రామ మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ కొత్త విధానం వల్ల గ్రామప్రజలు ఎవరూ అయోమయానికి గురికాకూడదని,అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు భద్రంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా ఒక బృందాన్ని (ప్రతినిధులను) ఏర్పాటు చేశారు.ఈ ప్రత్యేక ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ఓట్ల వెరిఫికేషన్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తారు.ప్రతిరోజూ కురవంక పంచాయతీ ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్తున్నారు.ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) వచ్చే సమయానికి ప్రజలు సిద్ధంగా ఉండేలా సర్ ప్రక్రియలో భాగంగా ఏయే పత్రాలు సమర్పించాలి,ఓటును ఎలా సరిచూసుకోవాలనే విషయాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా,ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఈ డోర్–టు–డోర్ సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి రాష్ట్ర ప్రభుత్వం,ఎన్నికల సంఘం కొత్తగా ప్రవేశపెట్టిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రతి ఓటరుకూ అవగాహన కలిగి ఉండాలన్నారు.గ్రామంలోని ఏ ఒక్క అర్హుడైన ఓటరు కూడా సాంకేతిక కారణాల వల్ల ఓటు కోల్పోకూడదనేదే నా తాపత్రయం అన్నారు.అందుకోసమే మా సిబ్బంది నిత్యం మీ ఇళ్లకు వచ్చి ఓట్ల వెరిఫికేషన్ ఫారాల పూర్తిపై సహాయం అందిస్తారని,గ్రామస్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ ఓటును సురక్షితం చేసుకోవాలన్నారు.గ్రామంలో ఓటర్ల హక్కులను కాపాడేందుకు,సరికొత్త ఎస్ఐఆర్ విధానంపై ఇంతలా స్పందించి ఇంటింటికీ సేవలు అందిస్తున్న మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతికి కురవంక గ్రామ ప్రజలు,పెద్దలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# పీర్ల పండగ కార్యక్రమంలో పాల్గొన్న స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు

**సిద్ధవటం ప్రజా సీమ**

ఒంటి మిట్ట మండలం మండపం పల్లె గ్రామపంచాయతీలోని అచ్చంపేట గ్రామంలో బాదుల్లా పీర్ మరియు కాశీం పీర్లు ఫాతిహా సదింపులు కార్యక్రమంలో పాల్గొన్న ఏపి స్టేట్ నూరు భాష దూదేకుల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీర భద్రుడు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని ఆ దేవున్ని కోరుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఒంటి మిట్ట జడ్పిటిసి ముద్దు కృష్ణారెడ్డి సాలాబాద్ బుజ్జయ్య, మండపం పల్లె ఎంపీటీసీ కర మళ్ళ భాష వారు ఏర్పాటు చేసిన ఉచిత భోజన వసతి కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్య క్రమంలో జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి సాలాబాదు బుజ్జి మట్టపంపల్లి ఎంపీటీసీ కరమళ్ళ భాష తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





# మదనపల్లెలోని బి.టీ.కళాశాలని కాపాడుకుందాం

## – తొలగించిన కోర్సులను సత్వరమే పునరుద్ధరించాలి–– బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ కుమార్ డిమాండ్

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలో ఎంతో చారిత్రాత్మకమైన నేపథ్యం కలిగిన బి.టి.కాలేజీని (బీసెంట్ థియోసాఫికల్ కాలేజీ) గత వైభవాన్ని గుర్తుచేసేలా అభివృద్ధి చేయాలని,రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ విద్యాసంస్థను వాడుకోవడం మానుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ ఆరోపించారు.గురువారం మదనపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలేజీ దుస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం బి.టి.కాలేజీని ప్రభుత్వ కాలేజీగా మారుస్తున్నట్లు జీవో (జీ.ఓ) విడుదల చేసి,సంబరాలు చేసుకున్నారే తప్ప నేటికీ ఆ జీవో అమలు కాలేదన్నారు.ప్రస్తుతం ఈ కాలేజీ అసలు ప్రభుత్వ ఆధీనంలో ఉందా లేదా ఎయిడెడ్ పరిధిలో ఉందా అనే కనీస స్పష్టత లేకుండా పోయిందన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఈ కాలేజీ నుండి అనేక కీలకమైన విద్యా కోర్సులను తొలగించారని,దీనివల్ల స్థానిక పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే తొలగించిన అన్నికోర్సులను తక్షణమే పునరుద్ధరించాలని,ఎన్నికల సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బి.టి.కాలేజీని యూనివర్సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారని,కానీ ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.ఇప్పటికైనా కాలేజీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని,మదనపల్లెలో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఉంది,కానీ అబ్బాయిల చదువుల కోసం ఒక్క ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా లేదన్నారు.అబ్బాయిలకు ఉన్న ఏకైక దిక్కు బి.టి.కాలేజీ మాత్రమేనని,అలాంటి కాలేజీని



సరైన నిర్వహణ లేకుండా నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు.అన్ని రాజకీయ పార్టీలు బి.టి. కాలేజీని కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే వాడుకుంటున్నారు తప్ప,కాలేజీ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తొలగించిన అన్ని కోర్సులను తిరిగి ప్రవేశపెట్టాలని,కాలేజీకి పూర్వ వైభవాన్ని,ఖ్యాతిని తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలని పునీత్ కుమార్ డిమాండ్ చేశారు.లేనిపక్షంలో విద్యార్థులు,యువతతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

# మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ని కలిసిన మౌనేంద్ర కుమార్ రెడ్డి

**రైల్వే కోడూరు (ప్రజా సీమ):**



బెంగళూరులోని జక్కూర్ ఏరోడ్రోమ్ వద్ద మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మరియు వై ఎస్ . జగన్ మోహన్ రెడ్డి ని రైల్వే కోడూరు నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షుడు మౌనేంద్ర కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, యువత ఉపాధి అవకాశాలు, విద్యార్థుల సమస్యలు, పార్టీ బలోపేతం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరియు భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చించామని అన్నారు . యువత రాజకీయాల్లో మరింత చురుకుగా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జగన్ మోహన్ రెడ్డి సూచించారని తెలియజేశారు. ఈ సందర్భంగా మౌనేంద్ర కుమార్ రెడ్డి, ఒక మీడియా ప్రకటనలో తెలియజేస్తూ జగన్ నాయకత్వం పట్ల తమకు పూర్తి విశ్వాసం ఉందని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు.

ప్రజాసీమ

## కోన గ్రామంలో మత సామరస్యానికి ప్రతీకగా ఘనంగా మొహరం ఉత్సవాలు..

**కలకడ (ప్రజాసీమ):**

కలకడ మండలంలోని కోన గ్రామంలో మొహరం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక ప్రార్థనలు, సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.మొహరం వేడుకల్లో భాగంగా గ్రామస్తులు అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు అగ్నిగుండం చుట్టూ భక్తి పారవశ్యంతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున హాజరై వేడుకలను తిలకించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, మొహరం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా గ్రామ ప్రజల సహకారంతో వేడుకలను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయగా, గ్రామ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య మొహరం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



## బండి వారి నూతన గృహప్రవేశ కార్యక్రమం స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు

**సిద్ధవటం ప్రజా సీమ**

కడప నియోజవర్గం రామాంజనేయపురం సబ్ జైల్ దగ్గర ఉన్న బండి శ్రీకృష్ణ బండి శ్రీహరి ఇద్దరు అన్నదమ్ములు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ స్టేట్ నూర్ భాషా అండ్ దూదేకుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు పాల్గొన్నారు అనంతరం వారు ఏర్పాటు చేసిన విందు భోజనాలు కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగిందని అన్నారు



## పోలీసు శాఖకు స్పెషల్ బ్రాంచ్ వెన్నెముకతో సమానం

### - అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడి

### - జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్బి) సీఐగా యు.సదాశివయ్య

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య జిల్లా నూతన స్పెషల్ బ్రాంచ్ (ఎస్బి) సీఐగా యు.సదాశివయ్య గురువారం బాధ్యతలు స్వీకరించి,జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్‌బీ పాత్ర చాలా కీలకమన్నారు.అసాంఘిక శక్తులపై నిరంతరం నిఘా ఉంచి,పక్కా ముందస్తు సమాచారంతో నేరాలను అరికట్టాలని నూతన సీఐని ఆదేశించారు. అంకిత భావంతో పనిచేసి జిల్లా పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ,ఎస్పీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.శాంతి భద్రతల పరిరక్షణ,ప్రజా శ్రేయస్సు కోసం పోలీస్ శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.



## గుంతలకు గుడ్‌బై

### విందూరు అర్ అండ్ బి రోడ్డుకు రూ.7 కోట్ల నిధులు

**ప్రజా సీమ ప్రతినిధి - గూడూరు రూరల్**

నెల్లూరు జిల్లా గూడూరు రూరల్ మండలంలోని విందూరు గ్రామానికి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డును మరమ్మతు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పాశం. సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు నుంచి విందూరు, మిట్టత్మూరు మీదుగా వీరంపల్లి గ్రామం వరకు ఉన్న ఈ రహదారి గుంతలతో దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని చెప్పారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. ఈ నిధులతో రోడ్డు మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానుండగా..పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఎమ్మెల్యే కృషితో నిధులు మంజూరు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు...

## విద్యాసంస్థల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల పాత్ర కీలకం

### - మిట్స్ యూనివర్సిటీలో ఘనంగా అల్యూమ్ని మీట్






**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలోని మిట్స్ (మదనపల్లి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) డీమ్డ్ టు బి యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎం.బి.ఏ) విభాగం ఆధ్వర్యంలో గురువారం మిట్స్ అల్యూమ్ని రిలేషన్స్ సెల్ సహకారంతో అల్యూమ్ని మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ విద్యా సంస్థల అభివృద్ధి, ప్రతిష్ఠ మరియు సమాజంలో వాటి గుర్తింపు ను పెంపొందించడంలో పూర్వవిద్యార్థులు కీలక పాత్ర పోషిస్తారన్నారు.అల్యూమ్ని నెట్‌వర్క్ ద్వారా ప్రస్తుత విద్యా ర్థులకు పరిశ్రమల అవసరాలపై అవగాహన,కెరీర్ మార్గదర్శకత్వం, ఇంటర్న్‌షిప్‌లు మరియు ఉపాధి అవకాశాలు మరింత విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల విజయాలే విద్యాసంస్థలకు నిజమైన గుర్తింపని పేర్కొన్నారు.విద్యార్థులు విద్యా ప్రతిభతోపాటు కమ్యూనికేషన్,నాయకత్వ లక్షణాలు,సమస్య పరిష్కార నైపుణ్యాలను కూడా పెంపొందించుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు.స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ డాక్టర్ భానుశ్రీ రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థ మరియు పూర్వవిద్యార్థుల మధ్య బలమైన అనుబంధం సంస్థ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని తెలి పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో పూర్వవిద్యార్థుల భాగస్వామ్యం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.అల్యూమ్ని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగశ్వేత మాట్లాడుతూ పూర్వ విద్యా ర్థులు మెంటరింగ్,గెస్ట్ లెక్చర్లు, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్ మెంట్లు, పరిశ్రమల అనుసంధాన కార్యక్రమాలు మరియు కెరీర్ మార్గదర్శకత్వంలో చురుకుగా పాల్గొని తమ అనుభవాలను విద్యార్థు లతో పంచుకోవాలని కోరారు.అల్యూమ్ని నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసి విద్యార్థుల వృత్తి అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు జి.అనిల్ దత్, దుర్గా చప్పల,అజయ్ నక్కల, ఎస్.శ్రవంతిలు తమ వృత్తి ప్రయాణంలో ఎదురైన అనుభవాలు,పరిశ్రమలలో ఉన్న అవకాశాలు,అవసరమైన నైపుణ్యాలు మరియు ఉద్యోగ రంగంలో విజయానికి అవసరమైన అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు.అలాగే భవిష్యత్తులో ఇంటర్న్‌షిప్‌లు,కెరీర్ మార్గదర్శకత్వం, పరిశ్రమల పరిచయాలు మరియు ప్లేస్‌మెంట్ అవకాశాల కల్పనలో తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఇందులో భాగంగా విద్యార్థుల ఉపాధి అవకాశాలు, పరిశ్రమల అవసరాలకు అను గుణమైన నైపుణ్యాభివృద్ధి, మెంటరింగ్ కార్యక్రమాలు మరియు భవిష్యత్ సహకార అవకాశాలపై విస్తృతంగా చర్చిం చారు. 2007 నుండి 2025 వరకు వివిధ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొని తమ విద్యా జీవితంలోని మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ, ప్రస్తుత విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్,స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ డాక్టర్ భానుశ్రీ రెడ్డి,అల్యూమ్ని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగశ్వేత,కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు,పూర్వ విద్యార్థులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికల రక్షణే లక్ష్యంగా పోలీస్ అధికారుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం

**కలకడ(ప్రజా సీమ)**

కలకడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం విద్యార్థినుల భద్రత, చట్టాలపై అవగాహన పెంపొందించడం మరియు సమాజంలో జరుగుతున్న వివిధ నేరాల పట్ల అప్రమత్తత కల్పించడం లక్ష్యంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలకడ సీఐ లక్ష్మన్న మరియు ఎస్సై రామాంజనేయులు పాల్గొని విద్యార్థినులకు పలు ముఖ్యమైన అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు తమ హక్కులు, చట్టపరమైన రక్షణలు మరియు భద్రతకు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ముఖ్యంగా బాలల భద్రత, బాల్య వివాహాల నిర్మూలన, ప్రేమ పేరుతో మోసపోయి ఇళ్లను విడిచిపెట్టి వెళ్లే సంఘటనల వల్ల కలిగే నష్టాలు , పోక్సో (గూాజూూ) చట్టం, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై వివరంగా చర్చించారు.నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థినులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులతో స్నేహాలు చేయడం, వ్యక్తిగత వివరాలు పంచుకోవడం, అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ వేధింపులు, ఫేక్ అకౌంట్లు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అలాగే బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికల భవిష్యత్తును దెబ్బతీసే చర్యలని పేర్కొన్నారు.విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, తల్లిదండ్రులు కూడా బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. చిన్నారుల రక్షణ కోసం రూపొందించిన పోక్సో చట్టం గురించి వివరించి, ఎలాంటి వేధింపులు జరిగినా భయపడకుండా ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన డయల్-112, పిల్లల సహాయార్థం అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్-1098, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన 1930 హెల్ప్‌లైన్ నంబర్ల గురించి విద్యార్థినులకు వివరించారు.సమస్యలు ఎదురైనప్పుడు లేదా అనుమానాస్పద పరిస్థితులు కనిపించినప్పుడు వెంటనే ఈ సేవలను వినియోగించాలని సూచించారు.విద్యార్థినులు తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సీఐ లక్ష్మన్న, ఎస్సై రామాంజనేయులు తెలిపారు.విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు. పోలీసు అధికారులు అందించిన అవగాహన విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి, వారి భద్రత పట్ల బాధ్యతను పెంచే దిశగా ఈ కార్యక్రమం ఎంతో దోహదపడిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభిప్రాయపడింది.



## మతసామరస్యానికి ప్రతీక మొహరం

### మొహరం వేడుకల్లో నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

**రాజంపేట (ప్రజా సీమ)**

మతసామరస్యానికి ప్రతీకగా మొహరం పండుగ నిలుస్తుందని రాజంపేట టిడిపి ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. గురువారం సాయంత్రం, ఒంటిమిట్ట మండలం మంటపం పల్లి నందు జరుగుతున్న మొహరం వేడుకలకు ఒంటిమిట్ట జడ్పిటిసి అద్దలూరి ముద్దుకృష్ణారెడ్డి ఆహ్వానం మేరకు నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు విచ్చేసి, ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులందరికీ మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే మొహరం పండుగ సమాజంలో సోదరభావాన్ని, శాంతిసౌఖ్యాలను పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. హిందూ ముస్లింల ఐక్యతకు మన ప్రాంతం ఎప్పుడూ నిదర్శనంగా నిలుస్తుందని, అందరూ కలిసికట్టుగా పండుగలను జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చమర్తి జగన్ మోహన్ రాజు వెంట జడ్పిటిసి అద్దలూరి ముద్దుకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## మద్యానికి బానిసై యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య

**కడప, జూన్ 25 (ప్రజాసీమ) :**

కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రముక్కపల్లి ప్రాంతంలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల మేరకు, ఎర్రముక్కపల్లి పల్లా చౌడయ్య వీధికి చెందిన పత్తిపాటి భాస్కర్ (20) లారీ డ్రైవింగ్, గూడ్స్ లోడింగ్ పనులకు వెళ్లేవాడు. అయితే కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో పనులకు సరిగా వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటూ, మద్యం మత్తులో తరచూ ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులను బెదిరించేవాడని తండ్రి పత్తిపాటి రఘురామాచారి ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి మద్యం సేవించిన భాస్కర్ బైక్‌పై వెళ్తూ సీపీ బ్రౌన్ సర్కిల్ సమీపంలో కిందపడగా, బైక్ దెబ్బతిన్నట్లు సమాచారం. అనంతరం ఇంటికి వచ్చిన అతడిని తండ్రి మందలించారు. రాత్రి తన గదిలోకి వెళ్లి పడుకున్న భాస్కర్, గురువారం ఉదయం ఎంతసేపు తలుపు తట్టినా స్పందించలేదు. దీంతో కుటుంబ సభ్యులు కిటికీలో నుంచి చూడగా, చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు.తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి స్థానికుల సహాయంతో కిందికి దించగా, అప్పటికే భాస్కర్ మృతి చెందినట్లు గుర్తించారు. మద్యానికి బానిస కావడం, జీవితంపై విరక్తి చెందడంతో మద్యం మత్తులోనే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.సమాచారం అందుకున్న కడప వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రజాసీమ

# ముగ్గురు నిందితులు అరెస్ట్

## - రూ.18.70 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం.






**రైల్వే కోడూరు (ప్రజాసీమ):**

తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు ఇంటి చోరీ కేసులను పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 170 గ్రాముల బంగారు ఆభరణాలు, విలువ రూ.18.70 లక్షలు, స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, వై.కోట పంచాయతీ పరిధిలోని యద్దలవారిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు బాధితుల ఇళ్లలో జరిగిన చోరీల్లో మొత్తం 19 తులాల బంగారం (విలువ సుమారు రూ.20.90 లక్షలు) అపహరించబడింది. విచారణ అనంతరం పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, అందులో 17 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్టు చేసిన నిందితులు:**

కొండేటి జ్యోతి ప్రకాష్ అలియాస్ పవన్ (19), ఉమ్మక శివ మనోజ్ అలియాస్ మనోజ్ (19), నందలూరు కౌశిక్ కుమార్ రెడ్డి అలియాస్ కౌశిక్ (20).ఈ కేసులో మరో నిందితుడు ఎద్దుల అఖిల్ వర్ధన్ అలియాస్ అఖిల్ పరారీలో ఉండగా, అతని కోసం ప్రత్యేక నిఘా కొనసాగుతు న్నట్లు పోలీసులు తెలిపారు.జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ పర్యవేక్షణలో, రేణిగుంట ఎస్డీపీఓ వై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూరల్ సీఐ డి శ్రీనివాసులు నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఈ కేసును ఛేదించింది. కేసును విజయవంతంగా పరిష్కరించిన ఎస్డిపి ఓ, వై శ్రీనివాసరావు, రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, ఎస్ ఐ కే.సుజనా కుమార్, హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వర్లు పిసిలు వి.బ్రహ్మానందరెడ్డి, బి కార్తీక్ కుమార్ వి వెంకటయ్య మరియు ఇతర పోలీసు బృందాన్ని ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు**

ఇళ్లను తాళం వేసి బయటకు వెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.

విలువైన బంగారం, నగదు వంటి వస్తువులకు తగిన భద్రత కల్పించాలి.గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి.

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ( ఎల్ హెచ్ ఎం ఎస్) సేవలను వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని పోలీసులు సూచించారు.జిల్లాలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకు భంగం కలిగించే నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు

# ముమ్మరంగా 'ఎస్.ఐ.ఆర్' పరిశీలన

## శ్రేణులకు చమర్తి జగన్ మోహన్ రాజు దిశానిర్దేశం






**రాజంపేట(ప్రజా సీమ)**

రాజంపేట నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ా.×.=) ప్రక్రియను మరింత పటిష్టం చేసే దిశగా తెలుగుదేశం పార్టీ ముమ్మర చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు నియోజకవర్గ పార్టీ అబ్జర్వర్ భీమినేని చిట్టిబాబు తో కలిసి గురువారం సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ విధానాన్ని పరిశీలించిన అనంతరం, వారు ఆయా మండలాల అధ్యక్షులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌చార్జీలతో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితా సవరణ అత్యంత కీలకమైనదని, క్షేత్రస్థాయి నాయకులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నాయకులకు దిశానిర్దేశం చేశారు.

?ఈ పర్యటనలో చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం నిర్వహణలో పార్టీ శ్రేణులు ఎలాంటి అలసత్వాన్ని వహించరాదని స్పష్టం చేశారు. ప్రతి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ముఖ్యంగా బూత్ స్థాయిలో పార్టీ బలానికి పునాది అయిన ప్రతి 'బూత్ లెవెల్ ఏజెంట్' (దీూా) ఈ ప్రక్రియలో తప్పనిసరిగా, చురుగ్గా పాల్గొనాలని ఆయన ఆదేశించారు. క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు నిరంతరం బూత్ స్థాయి ఏజెంట్లను సమన్వయం చేసుకుంటూ.. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు కి సంబంధించిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జులై 2 న రైల్వే కోడూరు కు ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, కేంద్ర మంత్రులు రాక.





**-సభాస్థలిని పరిశీలించిన ముక్కా రూపానంద రెడ్డి, అరవ శ్రీధర్, టిడిపి యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి.**

**-సభను దిగ్విజయవంతం చేస్తామన్న ముక్కా రూపానంద రెడ్డి**

**రైల్వే కోడూరు ప్రజా సీమ**

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లి పంచాయతీ మంగంపేట వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న లేఅవుట్ లో జులై 2 న జరగబోయే విబిజి రాంజీ గ్రామీణ పథకం (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ మరియు అజీవిక మిషన్ (గ్రామీణ) ప్రారంభోత్సవ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రి హాజరు కానున్న నేపథ్యంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి పార్టీ ఇన్చార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి గారు, రైల్వే కోడూరు నియోజకవర్గ శాసనసభ్యులు అరవ శ్రీధర్,టిడిపి యువ నేత ముక్కా సాయి వికాస్ రెడ్డి లు అధికారులతో కలిసి స్థల పరిశీలన చేపట్టడం జరిగింది. సభ స్థలాన్ని అధికారులు అనుమతించిన పిమ్మట బుధవారం నుండి సభాస్థలి పనులు ప్రారంభించారు .ఈ సందర్భంగా ముక్కారూపానంద రెడ్డి , అరవ శ్రీధర్ మాట్లాడుతూ వీ బీ జి రాంజీ పథకం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకం జూలై 2వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రైల్వే కోడూరు నియోజక వర్గంలో ప్రారంభోత్సవ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో నేడు సంబంధిత అధి కారులతో కలిసి సభాస్థలిని ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లి పంచాయతీ మంగంపేట ఆవరణలో ఉన్న సుమారు 50 ఎకరాల లో అధికారులతో కలిసి పరిశీలించి పనులు ప్రారంభించడం జరిగాయని, ఈ సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పాల్గొంటారని తెలియ జేశారు.

# చెత్త సేకరణ కేంద్రాలపై ఎందుకు చిన్నచూపు

## కోట్ల రూపాయలు వెచ్చించి కట్టిన రుధాయేనా

### చెత్త సేకరణకు ప్రతి ఊరిలో రిక్షా ఆ రిక్షాకు ఒక కార్మికుడు

**చిట్వేలి(ప్రజా సీమ)**

చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణం చేపట్టింది తడి చెత్త, పొడి చెత్త, వాటిని వేరువేరుగా ఉంచాలన్న విధానాన్ని ఆ నిర్మాణాలచోట తొట్లు నిర్మించి చెత్త సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో అప్పటినుండి ఇప్పటిదాకా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి రిక్షాలు వస్తున్నాయి వాటిని వినియోగిస్తున్నారా లేక మూల పడేస్తున్నారా చెత్త సంపదనం తయారు చేయాలన్న ఆశయాన్ని నీరు కారుస్తున్నది ఎవరని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలలో చెత్తను సేకరించి వాటిని ఎరువులుగా మార్చి రైతులు కి అందించాలన్నది ప్రభుత్వాల లక్ష్యం. కానీ చిట్వేలి మండలంలో ఎక్కడే కానీ ఆ సంపదను తయారుచేసిన విధానాన్ని లేరని అంటున్నారు. ఇదిలా ఉంటే చెత్త సేకరణ కేంద్రాలుగా నిర్మించిన చోట మందుబాబులకు పొద్దుపోతే అది ఒక అడ్డగా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో చెత్త సేకరణ కేంద్రం ఉండడంతో ఆహా హాయిగా మందు కొట్టొచ్చులే అనుకుంటున్నా మందుబాబులకు ఇది ఒక అవకాశం గా మారింది. మండలంలో నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాల పట్ల ఉన్నత స్థాయి అధికారులు ఏనాడైనా చిట్వేలు మండలం వైపు చూసి లక్షల రూపాయలు పరికరాలు కూడా అందినట్లు సమాచారం. ఆ పరికరాలకు కాపలాగా ఒక కార్మికుడిని కూడా పెట్టారన్నది సమాచారం. ఆ పరికరాలు మాత్రం పనిచేయడం లేదు తుప్పు పట్టిపోతున్నాయన్నమాట కూడా వాస్తవం ఈ వాస్తవాలను వెలికి తీయాల్సిన ఉన్నత స్థాయి అధికారులు ఆ శాఖకు సంబంధించిన వారు ఏమయ్యారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీరాజ్ లక్ష్యాన్ని నీరు కారుస్తున్నారన్న మాటలు ప్రజల నోట టూ ట మాదిరి వినిపిస్తున్నాయి. ఇది ఎక్కడి చోద్యం ప్రజాధనం మండలంలోని ఇంత వృధా అయితే జిల్లా వ్యాప్తంగా ఎన్ని కోట్ల రూపాయల వృధా అయ్యిందన్న లెక్కలు ఆ శాఖకు సంబంధించిన వారికి తెలియదా అని ప్రజలే ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా చెత్త సేకరణ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చిట్వేలి మండల ప్రజలు ఉన్నత స్థాయి అధికారులను కోరుతున్నారు.



# వరదరాజుల స్వామి ఆలయ వైభవం

## మట్లి రాజుల కాలంలో నిర్మించిన ఆలయం

### దినదిన అభివృద్ధి చెందుతూ కంకర్యాలు జరుపుకుంటున్న వరదరాజుల స్వామి

**చిట్వేలి(ప్రజా సీమ)**



అత్యంత పురాతనమైన ఎంతో వైభవంగా జరుపుకున్న ఆలయం ఎంతో శిలా సంపద స్వామివారికి మాన్యాలు ఉన్న పట్టెడు మెతుకులు స్వామివారికి నైవేద్యం పెట్టేవారు లేక మరుగున పడ్డ ఆలయాన్ని గత ఐదు సంవత్సరాల నుండి పాత చిట్వేలి లోనే యువత ముందడుగు వేయడంతో పెద్దల సహకారంతో దాతలు సహృదయంతో ఆలయ అభివృద్ధికి సహకారం అందించడంతోపాటు స్వామి వారి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు యువత కదం తొక్కింది. ఈ ఆలయం ఎక్కడ అనుకుంటున్నారా తిరుపతి జిల్లా చిట్వేలి మండల కేంద్రంలోని



పాత చిట్వేలి, లో వెలసిన వరదరాజుల స్వామి, దిన దిన అభివృద్ధి చెందుతూ ఆలయాన్ని రూపుదిద్దుకుంటూ స్వామివారి పూర్వ కైంకర్యాలను నిర్వహిస్తూ మండల ప్రజలే కాక సుదూర ప్రాంతాల నుండి స్వామివారి దర్శనార్థం ఆలయానికి విచ్చేస్తున్నారు. యువత నడుం బిగించడంతో వారికి సహకారంగా తాతలు నిలవగా అప్పటినుండి ఇప్పటికీ ఆలయ మార్పులు రూపురేఖలు మారాయి. విద్యుత్ కాంతులతో మండపం చూడచక్కని రూపాన్ని సంతరించుకుంది. ప్రక్కనే స్వామివారికి సేవలు నిర్వహించే ముంజల మండపం చూడముచ్చటగా తయారైంది. ఇదే పట్టుదలతో ఆ గ్రామ ప్రజలు పెద్దలు అదే ఆలయంలో కళ్యాణ మండపాన్ని నిర్మించాలన్న సంకల్పాన్ని ఆ భగవంతుడు ఆశీస్సులతో అది కూడా చకచకా జరిగిపోతుంది. నిత్యం స్వామివారికి కంకర్యాలు నిర్వహిస్తూ ఆలయ ప్రధాన అర్చకులు సతీష్ శర్మ, ఆయన కుమారుడు మణికంఠ, ఆలయ కైంకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆలయంలో ధూప దీప నైవేద్యాలు జరుగుతున్నాయి. ప్రతి శనివారం, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహిస్తున్నారు. 600 సంవత్సరాల నాటి చరిత్ర వరదరాజుల స్వామి వైభవం తిరిగి రావాలని ఆ బ్రహ్మోత్సవాలు మరలా నిర్వహించాలని మండల ప్రజలు భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుతున్నారు.

# గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య కొనసాగుతున్న సహాయక చర్యలు..సిఎం పర్యవేక్షణ

**కోల్‌కతా,జూన్25ప్రజా సీమ**

మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మరణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.

ప్రజాసీమ

# దేశంలో అతిపెద్ద గ్రామీణ క్రీడా సంబరం ఇషా గ్రామోత్సవం

## - మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా పోస్టర్ల ఆవిష్కరణ

## - హాజరైన భారతీయ జనతా పార్టీ నాయకులు

మదనపల్లె (ప్రజా సీమ) :

భారతదేశపు అతిపెద్ద గ్రామీణ క్రీడా సంబరాలలో ఒకటైన 18వ ఇషా గ్రామోత్సవం –2026 పోస్టర్లను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా గురువారం ఘనంగా విడుదల చేశారు.భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకులు మరియు జిల్లా నాయకత్వం పాల్గొని గ్రామీణ క్రీడలకు తమ మద్దతును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహ రెడ్డి,విజయభారతి కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు,బీజేపీ జిల్లా అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి,బీజేపీ సీనియర్ నాయకులు బర్నేపల్లె రవికుమార్,డాక్టర్ జి.అజ్మతుల్లా ఖాన్,డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి,యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి ఇషా గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామీణ యువతకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే వేదికగా ఈ పోటీలు నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గ్రామోత్సవం–2026లో వాలీబాల్ మరియు త్రోబాల్ పోటీలు నిర్వహించబడతాయన్నారు.గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యువత,క్రీడాకారులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడగా పాల్గొన్న నాయకులు ఇషా గ్రామోత్సవం పోస్టర్లను ఆవిష్కరించి పోటీల విజయానికి శుభాకాంక్షలు తెలిపారు.



# మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన రాయలసీమ జోన్ వైసీపీ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి

రైల్వే కోడూరు ( ప్రజా సీమ )

రెండు రోజులుగా పులివెందుల పర్యటన నిమిత్తం విచ్చేసిన , మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు డిఆర్యుసిసి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల పర్యటన నిమిత్తం విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న సర్ కార్యక్రమం గురించి ఎలా జరుగుతుంది ఏమిటి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడగడం జరిగిందని దానికి సంబంధించి సంపూర్ణ స్థాయిలో ప్రజలకు మన నాయకులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా సరైన పద్ధతిలో నిర్వహిస్తున్నామని తెలియజేశామని అంతేకాకుండా పలు విషయాల పైన కూడా చర్చించడం జరిగిందని అన్నారు.



# విద్యార్థి విజ్ఞాన్ మంతన్ 2026-27 పోస్టర్స్ ఆవిష్కరణ

## - హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే.సుబ్రహ్మణ్యం

మదనపల్లె (ప్రజా సీమ) :

విద్యార్థి విజ్ఞాన్ మంతన్ 2026–27 పోస్టర్లను అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే.సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు.గురువారం స్థానిక డీఈఓ ఆఫీస్ నందు విద్యార్థి విజ్ఞాన్ మంతన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఇన్ స్పైరింగ్ ఇన్నోవేషన్ అమాంగ్ స్టూడెంట్స్,డిజిటల్ బేస్డ్ లార్జెస్ట్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ ఫర్ ఎమర్జింగ్ ఇండియా విజ్ఞానశాస్త్రం పట్ల ఆసక్తి కలిగిన,సృజనాత్మక ఆలోచనలు పంచుకో వడానికి విద్యార్థులకు ఇది ఒక చక్కటి ప్లాట్ఫారం,జాతీయ స్థాయిలో డిజిటల్ వేదికగా ఆన్లైన్ పరీక్షలు నిర్వహించబడతాయి.ఆరవ తరగతి నుంచి 11వ తరగతి వరకు చదువు కునే విద్యార్థులు ఈ పోటి పరీక్షల్లో పాల్గొనవచ్చునన్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చక్కటి బహుమతులు అందించబడతాయన్నారు.ఈ కార్యక్రమం జాతీయ విద్యా శిక్షణ,పరిశోధన సంస్థ, విజ్ఞాన భారతి,నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, సంస్థలు సంయుక్తంగా జాతీయస్థాయిలో ఈ సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహించడం జరుగు తోంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని పరీక్షలకు హాజరు కావచ్చు.ఈ కార్యక్రమంలో వివిఎం కో–ఆర్డినేటర్ వరప్రసాద్,ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.భాస్కరన్,జగన్మోహన్ రెడ్డి,భాస్కర్,పిఎల్ఎన్ శాస్త్రి,అఫ్రోజ్ బాషా,సంఘ నాయకులు నరసింహులు పాల్గొన్నారు.వివరాలకు సెల్ 7702202288,లేదా వెబ్ సైట్ నందు మరిన్ని వివరాలు పొందవచ్చు.



# రాయలసీమ బానిసత్వం బ్రతుకులు ఇంకెన్నాళ్ళు

## -భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ కి కుంచం విన్నపం-12 జిల్లాలతో కలిపి ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు

## -అయ్యేవరకు, తుదిశ్వాసవరకు పోరాటం

ప్రొద్దుటూరు (ప్రజా సీమ) :

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమపై కన్ను తెరవాలని తరతరాలుగా రాయలసీమకు పాలకులు అన్యాయం చేస్తున్నారని, ఈ కన్నీళ్ళు, ఈ బానిక బ్రతుకులు ఎన్నాళ్ళు అని రాయలసీమ రాష్ట్ర సమితివ్యవస్థాపక అధ్యక్షులు ఉద్యమనేత డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపైధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ఎళ్ళుగా ఎదురు చూస్తున్న రాయలసీమరైతుల కష్టాలు ఏ నాటికి నెరవేరుతాయో కాలమే చెప్పాలన్నారు. తరతరాలకు వెనుకబడిపోతున్న దుస్థితిని రాయలసీమ రైతులు ఇంకెంతకాలం భరించాలనిప్రశ్నించారు. పాలకులు మారినప్పుడల్లా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, కొత్త కొత్త ప్రాజెక్టులు గుర్తుకు వస్తాయని, ఎక్కడాలేని అభిమానం, ప్రేమ, ఆప్యాయత రాయలసీమపై వలకబోస్తారని తెలిపారు. 1985లో దివంగత ముఖ్యమంత్రి యన్.టి.రామారావు రెండవసారి అధికారంలో వచ్చారని, 1986, 1987 సంవత్సరాలలో అప్పటి కాంగ్రెస్ నేతలు వై.యస్. రాజశేఖర్రెడ్డి, యం.వి.మైసూరారెడ్డి, బొజ్జారెడ్డి, బి. శేషశయనరెడ్డి, యం.వి. రమణారెడ్డి మొదలైన రాయలసీమ నాయకులతో పాటు నేను (డా. కుంచం వెంకటసుబ్బారెడ్డి) కూడా పాల్గొన్నానని గుర్తు చేశారు. రాయలసీమలో సాగునీటిప్రాజెక్టుల కోసం ఉద్యమించే రోజులలో, ఉద్యమాల తీవ్రత ఎక్కువగా వుందని భావించిన, ముఖ్యమంత్రిగా వున్న యన్టీ రామా రావు గాలేరి–నగరి, హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టులను ప్రకటించారు. తరువాత 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు రాయలసీమను సస్య శ్యామలం చేస్తామని చెప్పడంతో రాయలసీమ రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. ప్రాజెక్టుల కోసం ఉద్యమాలు చేసిన వై.యస్.రాజశేఖర్రెడ్డి 2003లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా పాదయాత్ర చేశారని, 2004లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్పార్టీ అఖండ విజయం సాధించి అధికారంలోకి వచ్చి వై.యస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. జలయజ్ఞం పేరుతో రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్యంగా కడప జిల్లాలో గండికోట ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. అలాగే గాలేరు,నగరి, హంద్రీనావా సుజల స్రవంతి ప్రాజెక్టుల మొదటి దశకు శ్రీకారం చుట్టారన్నారు. తన 5 సంవత్సరాల పరిపాలన కాలంలో గండికోట ప్రాజెక్టును, 11 వేల క్యూసెక్కుల ప్రవాహం వున్న పోతిరెడ్డిపాడు రెడ్ రెగ్యులేటర్ను 44 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహానికి పెంచి నిర్మించడం ద్వారా 2006 సంవత్సరంలో తెలుగుగంగ ద్వారా మొదటిసారిగా కడప జిల్లాకు నీరు విడుదలయ్యాని చెప్పారు. 2007 రాయలసీమ రాష్ట్ర సమితి రాజకీయ పార్టీని స్థాపించి, అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రత్యేక రాయలసీమ సాధించుటకు అనేక పాదయాత్రలు, ధర్నాలు చేశారన్నారు. ప్రత్యేక రాయలసీమ అనగా 12 జిల్లాలతో ఏర్పాటు అయ్యేవరకు, తుదిశ్వాస వరకు పోరాడుతానని తెలిపారు. జలయజ్ఞంలో మరో ముఖ్యమైన ప్రాజెక్టు దుమ్ముగూడెం నాగార్జున టైల్ పాండ్. దుమ్ముగుడెం ద్వారా గోదావరి జలాలను నాగార్జునసాగర్లోనికి ఎత్తిపోతల పథకం క్రింద నీటిని పంపిస్తారు. 160టి.యం.సి.ల గోదావరి జలాలను నాగార్జునసాగర్లోనికి పంపడం ద్వారా ఆ నీటిని కృష్ణా డెల్టాకు విడుదల చేస్తారన్నారు. ఆ మేరకు ఆదా అయ్యే నీటిని శ్రీశైలం ప్రాజెక్టు నుండి రాయలసీమ ప్రాజెక్టులకు మళ్లిస్తారు. డా. వై.యస్. రాజశేఖర్రెడ్డి ఆకస్మిక మరణంతో ప్రాజెక్టు నిర్మాణం ఆగిపోయిందాన్నారు. 2014లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి నారా చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయ్యారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం అవుతుందని, పోలవరం కుడి కాలువ ద్వారా పట్టిసీమ ఎత్తిపోతల పథకం కింద 80 టి.యం.సి.ల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తామని, రాయలసీమను సస్యశ్యామలవుతుందని ఊదరగొట్టే ప్రసంగాలు చేశారన్నారు. రాయలసీమ రైతులు పెట్టుకొన్న ఆశలు అడియాశలు అయ్యాయని తన ఆవేదన వ్యక్తం చేశారు.

2019లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి2019లో వై.యస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో రాయలసీమఎత్తిపోతల పథకం పనులు చేపట్టారు. 45 వేల క్యూసెక్కుల ప్రవాహం వున్న నీటిని 80 వేలక్యూసెక్కుల ప్రవాహానికి పెంచి నిర్మించడం ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు వరద నీటిని అందించలేదన్నారు. 2024 శాసనసభ ఎన్నికల్లో మరలా అధికారంలోకి వచ్చిన నారాచంద్రబాబునాయుడు సంవత్సరం తర్వాత పట్టిసీమ పోయింది, మరలా ఒక కొత్త ప్రాజెక్టులో ముందుకు వచ్చారని తెలిపారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టు సముద్రంలోకి వృథాగా పోయే సుమారు 200 టి.ఎం.సి.ల గోదావరి జలాలను పోలవరం బనకచర్ల ద్వారా రాయలసీమకు మళ్ళించి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని పాలకులు మాట్లాడుతున్నారు. వినేవారు వుంటే చెప్పేవారు ఎక్కువ వుంటారు. అని ఏమి చెప్పినా రాయలసీమ వారు అంతేకదా అని భావిస్తే, రాయలసీమ రైతులను ఇన్ని రకాలుగా ప్రలోభాలు పెడుతూ వుంటే చూస్తూ ఊరుకోమని అన్నారు. గత 42 సంవత్సరాలుగా



రాయలసీమ రైతులు సాగునీటిపరంగా నష్టపోతూనే వున్నారని, నాలుగు దశాబ్దాలుగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయలేకపోయారన్నారు. ఈ సారైనా గోదావరి జలాలను రాయలసీమ ప్రాజెక్టులకు తరలిస్తారని రాయలసీమ రైతులు ఎంతగానే ఆశలు పెట్టుకొన్నారన్నారని తెలిపారు. 1500 కోట్ల రూపాయలతో నిర్మాణం పూర్తి అయ్యే సిద్ధేశ్వరం బ్రిడ్జి–కం–బ్యారేజ్ నిర్మించాలని గత 9 సంవత్సరాలనుండి రైతులు కోరుతున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి యీ సంవత్సరమైనా సిద్ధేశ్వరం బ్రిడ్జి–కం–బ్యారేజ్ ను నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారన్నారు. సిద్ధేశ్వరం బ్రిడ్జి–కం–బ్యారేజ్ పూర్తి చేయడంవల్ల 60 టి.యం.సి.ల నీరు ఆదా అయ్యే అవకాశం వుందని, అదే విధంగా తెలంగాణలోని మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలకు కూడా ఎంతో ప్రయోజనకరంగా వుంటుందని కుంచం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఆ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మదనపల్లెలో వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ పర్యటన

## - మర్యాదపూర్వకంగా కలిసిన పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలి- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి చొరవ చూపాలని వినతి

మదనపల్లె (ప్రజా సీమ) :

అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలో గురువారం రాష్ట్ర కుటుంబ ఆరోగ్య,వైద్యవిద్యాశాఖ మంత్రి సత్యకుమార్ పర్యటించారు.ఇందులో భాగంగా టిడిపి రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా)లు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితుల గురించి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని,గతంలో దాదాపు 70 మంది వైద్యులు సేవలందించగా,ప్రస్తుతం కేవలం 24 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.దీని వలన మదనపల్లి నియోజకవర్గంతోపాటు,పరిసర గ్రామాల నుంచి చికిత్స కోసం వచ్చే వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రోగులను ఇతర ప్రాంతాలకు రెఫర్ చేసే ఘటనలు అధికంగా జరుగుతున్నాయని,ఐ.సి.యు విభాగం పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని ట్రామాకేర్ సేవలు కూడా ఆశించిన స్థాయిలో లేవన్నారు.ఆసుపత్రిలో పడకలు (బెడ్స్) అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించలేని పరిస్థితి నెలకొందని,ఇంకా పేద ప్రజలకు ఎంతో అవసరమైన మహాప్రస్థానం వాహనం కూడా అందుబాటులో లేకపోవడం వల్ల బాధిత కుటుంబ సభ్యులు మరింత ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు.కావున పైసమస్యలను అత్యవసరంగా పరిశీలించి,తగిన సంఖ్యలో వైద్యులను నియమించడం,ఐ.సి.యు మరియు ట్రామాకేర్ సేవలను బలోపేతం చేయడం,అవసరమైన వైద్య సదుపాయాలను కల్పించడం,మహాప్రస్థానం వాహనాన్ని ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుని మదనపల్లి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



అందించవలసిందిగా వారు మంత్రికి అందించిన పత్రములో పేర్కొన్నారు.దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# చిన్న బుడ్డా నాయక్ మృతిపై విచారణ జరిపించండి

## - ఎమ్మెల్యేని అభ్యర్థించిన నారమాకుల తండావాసులు

మదనపల్లె (ప్రజా సీమ) :

మండలంలోని నారమాకులపల్లి తండాకు చెందిన చిన్న బుడ్డా నాయక్ (35) గత గురువారం రాత్రి దండువారిపల్లి మామిడి తోపు సమీప ప్రాంతంలో విగతా జీవిగా పడి ఉన్న చిన్న బుడ్డా నాయక్ మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు.దీనిపై తాలూకా పోలీసులు గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడని అనుమానాస్పద మృతి చెందినట్లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.చిన్న బుడ్డా నాయక్ ను కొంతమంది వ్యక్తులతో కలిసి భార్య హత్య చేయించిందని ఆరోపిస్తూ రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్,ఎస్పీలకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా నివాసానికి పెద్దఎత్తున కుటుంబ సభ్యులు,గ్రామ ప్రజలు చేరుకున్నారు.మృతి చెందిన బుడ్డా నాయక్ ది ప్రమాదం కాదని,హత్య అని న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు మొరపెట్టుకున్నారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.






# వెనిజువెలాను వణికించిన వరుస భూకంపాలు

**39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు**
**నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు**
**ప్రాథమిక సమచారం మేరకు 32 మంది మృతి**
**దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు**
**అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్**







**కారకాస్,జూన్25ప్రజా సీమ :**

వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది. మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వెనెజువెలాలోని సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోయింది. దీంతో విమానాశ్రయంలోని టెర్మినల్ మొత్తం దుమ్ముతో నిండిపోయింది. కొంతమంది ప్రయాణికులు తమ లగేజీ పట్టుకుని ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మరికొంతమంది లోపలే ఓ ఫుడ్ కౌంటర్ వద్ద ఆశ్రయం పొందారు. మొత్తం దుమ్ముతో నిండిపోతున్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడే ఉండిపోయారు. తీరప్రాంత నగరమైన లా గువైరాకు సంబంధించిన మరో వీడియో వెలుగులోకి వచ్చింది. వరుస భూకంపాలతో కూలిపోయిన భవనాలు, గాలిలోని దుమ్ము, నిర్మానుష్యంగా మారిన రహదారులు ఆ వీడియోలో కనిపించాయి.వెనెజువెలా రాజధాని కారకాస్‌లోనూ భారీ విధ్వంసం జరిగింది. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. స్థానికులు ప్రాణభయంతో కేకలు వేసిన దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. మరో వీడియోలో ఓ వ్యక్తి తన పెంపుడు కుక్కల ప్రాణాలు కాపాడిన దృశ్యాలు కనిపించాయి. కూలిపోయిన తమ ఇంటి నుంచి అతి కష్టం మీద కుటుంబ సభ్యులను కాపాడుకున్నాడు బాధితుడు. ఆ తర్వాత తన రెండు కుక్కలనూ ప్రాణాలతో బయటకు తీసుకువచ్చాడు.ఇలాంటి అనేక వీడియోలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోవైపు జంట భూకంపాల అనంతరం వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

**ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి**
**72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర**
**బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా**

**న్యూఢిల్లీ,జూన్25ప్రజా సీమ :**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా–ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి (ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ.2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ.2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది. మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 511.62 పాయింట్లు పెరిగి 77,502 వద్ద, నిఫ్టీ 150 పాయింట్ల లాభంతో 24,172 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు పెరిగి 94.33 వద్ద కొనసాగుతోంది.

# జాతీయ సెలవు దినం కావడంతో ప్రజలంతా ఇంటివద్దే

**ప్రాణనష్టం భారీగా ఉండొచ్చంటున్న యూఎస్ జియలాజికల్ సర్వే**
**ప్రజలు ఇళ్లను వదిలి బయటకు రావాలని పిలుపు**

**కారకాస్,జూన్25ప్రజా సీమ :**

వెనెజువెలా దేశాన్ని వరుసగా రెండు భూకంపాలు వణికించాయి. ఈ ప్రకృతి విపత్తు తీవ్రత ధాటికి దేశ రాజధానిలో తీవ్ర నష్టం వాటిల్లింది. పలు బహుళ అంతస్తు భవనాలు కూలిపోయాయి. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయి ఉండొచ్చని, దాంతో భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ భూకంపాల తర్వాత బలమైన ప్రకంపనలు రావొచ్చు. దాంతో ఈ విపత్తు విధ్వంసకరంగా ఉండొచ్చు. భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉంది. మృతుల సంఖ్య 10వేల నుంచి లక్ష వరకు ఉండవచ్చని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ప్రస్తుతానికి వెనెజువెలా ప్రభుత్వం మృతుల సంఖ్యపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. భూకంపాల ధాటికి గాయపడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉందని స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. ఇళ్లను వదిలి బయటకు వచ్చేయాలంటూ భూకంపాల ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వెనెజువెలా ప్రభుత్వం సూచించింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇళ్లకున్న పెట్రోల్ సరఫరాను కట్ చేసినట్లు వెల్లడించింది. కొన్ని భవనాలు కూలిపోయాయని, మరింత నష్టం వాటిల్లకుండా ఈ చర్యలని పేర్కొంది. జూన్ 24.. వెనెజువెలాలో నేషనల్ హాలిడే. దాంతో మిగతా రోజులతో పోలిస్తే.. ఎక్కువమంది ఇళ్లలోనే ఉన్నారు. బుధవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో తొలి భూకంపం వచ్చింది. దాంతో భూమి కంపించినప్పుడు భారీగా ప్రజలు బయటకు పరిగెత్తిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాణనష్ట తీవ్రత పెరగడానికి ఈ హాలిడే కూడా ఒక బలమైన కారణం కావొచ్చని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తులో భారీగా మరణాల సంఖ్య ఉండొచ్చని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ కూడా తన సందేశంలో పేర్కొన్నారు. రెండు భారీ భూకంపాల తర్వాత 20 వరకు ప్రకంపనలు వచ్చాయి.

# ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

**బహుభార్యత్వం కూడా సమర్థనీయమే**
**మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు**
**తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు..పాక్‌కు వెళ్లాలని హితవు**

**ముంబై,జూన్25ప్రజా సీమ :**

మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్–ఎ–హసన్, తలాక్–ఎ–అహ్సాన్, తలాక్–ఎ–బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ



యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై విచారణ

**- స్పీకర్ తీర్పు కాపీలను సమర్పించాలని హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్,జూన్25ప్రజా సీమ :**

పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేసు విచారణను వాయిదా వేస్తూ తదుపరి విచారణను జూలై 22కు నిర్ణయించింది.

# వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

**సాయం అందిస్తామని ప్రకటన**
**సాయం కోసం సిద్దంగా ఉన్నామన్న ట్రంప్**

**న్యూఢిల్లీ,జూన్25ప్రజా సీమ :**



వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.



# కలెక్షన్లు రాబడుతున్న మా ఇంటి బంగారం

## ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లు




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర మంచి ప్రదర్శన కనబరుస్తుంది. విడుదలైన తొలి వారంలోనే ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూ సమంత కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లింగ్ అంశాల కలయికతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. భారతదేశంలో రూ.33.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేయగా, దేశీయ గ్రాస్ వసూళ్లు రూ.38.36 కోట్లకు చేరుకున్నాయి.విడుదలైన ఆరో రోజున కూడా సినిమా మంచి వసూళ్లు సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్ర జోరు కొనసాగుతోంది. విదేశీ మార్కెట్లలో కూడా ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు ఓవర్సీస్‌లో ఈ చిత్రం రూ.17.35 కోట్ల గ్రాస్ కలెక్షన్లు నమోదు చేసినట్లు ట్రేడ్ రిపోర్టులు సూచిస్తున్నాయి. ఆరో రోజున ఒక్క రోజులోనే విదేశీ మార్కెట్ల నుంచి రూ.కోటికి పైగా వసూళ్లు రావడం విశేషం. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూకే మార్కెట్లలో సినిమాకు మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా కాలం తర్వాత సమంత ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా యాక్షన్, ఫ్యామిలీ, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సినిమాలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, శ్రీముఖి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

# సందీప్ కిషన్ సూపర్ సుబ్బు

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'సూపర్ సుబ్బు'. నెట్‌ఫ్లిక్స్ సంస్థ అందిస్తున్న మొట్టమొదటి ఒరిజినల్ తెలుగు సిరీస్ ఇదే కావడం విశేషం. తాజాగా ఈ సిరీస్ అఫీషియల్ ట్రైలర్‌ను నెట్‌ఫ్లిక్స్ ఇండియా విడుదల చేసింది. 'డీజే టిల్లు' ఫేమ్ డైరెక్టర్ మల్లిక్ రామ్ ఈ కామెడీ డ్రామా సిరీస్‌ను తెరకెక్కించారు. బాలీవుడ్ 'లిటిల్ థింగ్స్' ఫేమ్ మిథిలా పాల్కర్ ఈ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక అమాయక యువకుడు, అత్యంత సంప్రదాయ గ్రామం, అసాధ్యమైన ఓ ఉద్యోగం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఈ సిరీస్ వస్తోంది. సుబ్రమణ్యం చిలుకూరి రావు అలియాస్ సుబ్బు అనే ఒక అమాయక పల్లెటూరి యువకుడికి ఎవరూ వెళ్లడానికి ఇష్టపడని 'మాకీపూర్' అనే వింత ఊరికి పోస్టింగ్ వస్తుంది. తన తండ్రి కుకటేశ్వరరావు ముందు పరువు నిలబెట్టుకోవాలని ఆ ఊరిలో అడుగుపెట్టిన సుబ్బుకి అక్కడ ఊహించని షాక్ తగులుతుంది. దేశంలోనే అత్యధిక సంతానోత్పత్తి రేటు ఉండి, జనాభా నియంత్రణ లేని ఆ ఊరి జనాలకి మనోడు సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పాఠాలు చెప్పాల్సి వస్తుంది. ఒకవైపు జాబ్ టెన్షన్స్, లవ్ ప్రాబ్లమ్స్, ఇంకోవైపు ఊరి జనాల అపార్థాల మధ్య సుబ్బు పడే ఇబ్బందులు, క్రియేట్ చేసే కామెడీతో ఈ ట్రైలర్ నవ్వులు పూయించింది. మిథిలా పాల్కర్ ఒక క్రేజీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటి అవ్వాలని కలలుకనే పాత్రలో కనిపించనుంది. వీరితో పాటు కామెడీ కింగ్ బ్రహ్మానందం, వర్సటైల్ యాక్టర్ మురళీ శర్మ, గెటప్ శ్రీను, జీవన్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, భరత్ లక్ష్మీపతి ఈ సిరీస్‌ను నిర్మించారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ సంయుక్తంగా దీనికి కథను అందించారు. ఈ అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్ వెబ్ సిరీస్ జులై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

# నా బాడీ నాష్టం అంటే.. వాడి కళ్లు వాడి ఇష్టం

## స్త్రీల వేషధారణపై పరిమితులు ఉండాలన్న సునీత




ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సునీత ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత, మరియు సమాజంలో స్వేచ్ఛ అనే అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీశాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ చెప్పే సమాధానాన్ని సునీత తప్పుబట్టారు. కమర్షియల్ సినిమా అయినా, ఎలాంటి సినిమా అయినా సమాజం పట్ల కొంత బాధ్యత కలిగి ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సమాజంలో సినిమాని తిడితే, సినిమాలో సమాజాన్ని తిడుతున్నారు, సమాజం అలా ఉంది కాబట్టే తాము ఇలా సినిమా తీశామని మేకర్స్ చెబుతున్నారని సునీత పేర్కొన్నారు. ఇక ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న మై బాడీ మై రైట్ అనే స్లోగన్‌పై సునీత ప్రాక్టికల్ కోణంలో మాట్లాడారు. అమ్మాయిలు నా బాడీ నా ఇష్టం అని తమకు నచ్చిన బట్టలు వేసుకున్నప్పుడు, అవతలి వ్యక్తి చూసే చూపును కూడా వాడి కళ్ళు వాడి ఇష్టం అనాల్సి వస్తుందని, ఇందులో ఎవరినీ తప్పు పట్టలేమని అన్నారు. ఎవరి ఇష్టం వారిదని ఆమె స్పష్టం చేశారు. అయితే బట్టల పరిధిని పెంచుకోవడాన్ని లేదా తగ్గించుకోవడాన్ని తన దృష్టిలో అసలైన స్వేచ్ఛ అనరని సునీత తెలిపారు. చుట్టూ ఉన్న పరిసరాలు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో చూసుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కేవలం బట్టలు లేదా సిగరెట్లు తాగడం ఈక్వాలిటీ కాదని, సమాజంలో లేదా ఒక ఇంట్లో ఒక మహిళ తన అభిప్రాయాన్ని చెప్తే, దానికి పురుషులు ఎంతవరకు విలువ ఇస్తున్నారు అనే దానిపై పోరాడాలని సునీత అభిప్రాయపడ్డారు. పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై కూడా సునీత పరోక్షంగా ప్రస్తావిస్తూ ఎవరి ఒపీనియన్ వాళ్లది. ఎస్ చెప్పాలన్నా, నో చెప్పాలన్నా మన ఇష్టమే. కేవలం సినిమా ఇండస్ట్రీలోనే కాదు, నేను జనరల్ గా సొసైటీలో ఉన్న అమ్మాయిల గురించి కూడా మాట్లాడుతున్నాను. ఇక్కడ ఒక గీత గీయాలంటే, ఫుల్ స్టాప్ పెట్టాలంటే బలవంతం ఏమీ లేదు అని సునీత తెలిపారు.

# ధర్మన్‌లో రజనీ డాక్టర్ అవతారం

అగ్ర కథానాయకుడు సూపర్‌స్టార్ రజనీ కాంత్ తన 173వ సినిమాతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తలైవా 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నారు. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా రజనీకాంత్ పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబో తున్నట్టు తెలుస్తోంది. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, ఉలగ నాయగన్ కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. రజనీ, కమల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత సినిమా రావడం విశేషం. ఈ చిత్రంలో సిమ్రన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా చిత్రబృందం 'ది ఓజీ స్వాగ్' అనే క్యాప్షన్‌తో టైటిల్ పోస్టర్ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో రజనీకాంత్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి అభిమానులను ఫిదా చేస్తున్నాయి. డాక్టర్ కోట్‌లో స్టెతస్కోప్‌తో, సీరియస్ లుక్‌లో తలైవా లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యాయం కోసం ఏ స్థాయికైనా వెళ్లే డాక్టర్‌గా రజనీకాంత్ ఈ సినిమాలో కనిపిస్తారని టాక్. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 'ధర్మన్' త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. రజనీ మార్క్ యాక్షన్, డైలాగ్స్, ఎమోషన్‌తో పాటు సామాజిక అంశాలను టచ్ చేసే కథతో ఈ సినిమా రూపొందుతోందని తెలుస్తోంది.



# వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్



అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma